పల్లిపట్టు నాగరాజు రచించిన యాలై పూడ్సింది రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం 2022 కె.శ్రీనివాసరావు కేంద్ర సాహిత్యఅకాడమీ సెక్రటరీ, ముఖ్య అతిథి మమత కాళియా ప్రసిద్ధ హిందీ రచయిత్రి, మాదవ్ కౌశిక్ ప్రసిద్ధ హిందీ రచయిత, సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షులు చేతులు మీదుగా త్రివేణి కళా సంగమం,న్యూ ఢిల్లీ లో అందుకుంటూ..

రోడ్డుకు అడ్డంగా వ్యాపార ప్రకటనలు

ప్రమాదాలకు కారణమౌతూ..

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - నాయుడుపేట

నాయుడుపేటలో వ్యాపారులు అడ్డగోలుగా వ్యాపారాలు సాగిస్తున్నారు. వారిష్టమొచ్చినట్లు రేట్లు పెంచుకోవచ్చు.. వారికనుగుణంగా రోడ్డుకడ్డంగా వ్యాపార ప్రకటనల బోర్డులను పెట్టొచ్చు.. ఎవరైనా వాహనదారులు, సామాన్యులు ప్రశ్నిస్తే 'మా ఇష్టం... మేం ఇలాగే అమ్ముతాం... ఇలాగే బోర్డులు పెడతాం... మీకెందుకు' అని వాగ్వివాదానికి దిగుతారు. వినియోగదారుడు ఎవరికైనా మొరపెట్టుకుందామనుకుంటే ఎవ్వరూ కనిపించరు. ఏ అధికారికైనా చెప్పుకొంటే అది మా డిపార్ట్మెంట్ కాదు అనేది వారినుంచి వచ్చే సమాధానం. ఇది నాయుడుపేట ప్రజల పరిస్థితి. డిఎస్ఆర్ కల్యాణ మండపం ఎదురుగా ఒక పేద మహిళ పేదలకు ఎన్ఆర్జెసి బ్యాంక్ ఖాతాలు చేయించడం కోసం రోడ్డుకు సుమారు పదిహేను అడుగులు లోపలకి చిన్న పాక వేసుకుంటే కొంత మంది రాజకీనాయకుల కోసం ఆ పాకను క్షణాలలో తొలగించిన మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఇంత ప్రమాద కరమైన అడ్డంకులు ఎందుకు కనిపించటం లేదన్నది తెలపాల్సిన అవసరం ఉంది. ఆమెకు ఎదురుగానే ఉన్న ఫర్నిచర్ షాపులు వారు కుర్చీలు, సోఫాలు, ఒక్కటేమిటి ఆ షాపుల్లో అమ్మే వస్తువులు ప్రదర్శనకోసం రోడ్ల పైనే పెట్టేసి వ్యాపారం చేస్తుంటే సదరు కమిషనర్ కు అవి మాత్రం కనిపించవు. లెక్కకు మించి ఉన్న మునిసిపల్ కార్మికులు, అధికారులు పట్టణమంత తిరుగడుతుంటారే గాని వీటిపై ఎందుకో శ్రద్ధ చూపటం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నాయుడుపేటలో సెజ్, కోర్టు, ఆర్డీవో కార్యాలయం ఇలా అనేక కార్యాలయాలతో అధికారికంగా అభివద్ధి చెందుతుండడంతో రహదారికి ఇరువైపులా హోటళ్లు, దాబాలు, కేఫ్‌లు, బేకరీలు, కూల్‌డ్రింక్ షాపులు, ఫర్నీచర్ షాపులు ఇలా అధిక శాతంలో అనేక రకాల షాపులు విపరీతంగా వెలిశాయి. ఈ పోటీలతో వాహనదారులు అనేకరకాల ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుంది. వీరి మధ్య పోటీ రేట్లలో కాదు, వారి షాపులు బయటకు కనిపించాలనుకోవటంలో. అందువల్ల వారు రోడ్లపైకి వచ్చేసి బోర్డులు నాటుతూ రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం వెళ్లే జాగాకూడా మిగల్చడంలేదు. అందువల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడవలసిన పరిస్థితి ఏర్పడింది. అయిన వీరికి వారి వ్యాపారం జరగడం ఒక్కటే ముఖ్యం. ఎవరు ఎలా ఇబ్బంది పడినా పట్టించుకోరు.

ఈ కోవలో ముఖ్యంగా చెప్పుకోవలసింది ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ పరిధిలో గల ఎఫ్ 2 కేఫ్ గురించి. మొదలే అది రద్దీ ఎక్కువగా ఉండే రోడ్డు. మంచి బిజీ సెంటర్. పైగా టర్నింగ్ కూడా. ఈ ఎఫ్ 2 కేఫ్ చూసేందుకేమో రోడ్డుకు పదిహేను అడుగులు లోపలికే ఉంటుంది. కానీ బయట కూర్చునేందుకు కుర్చీలు వేసేసి కేఫ్ లోకి వచ్చే వారి వాహనాలకు పార్కింగ్ మాత్రం రోడ్డుపై వారి సొంత స్థలంలా విపరీతంగా పెట్టిస్తారు. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు దిగుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. ఇదేమని ఏ అధికారి అటువైపు కన్నెత్తైన చూడడు. ఇక శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు లోని హోటళ్ల పరిస్థితైతే సరే సరి. రోడ్డుపై బోర్డులు పెట్టటమే కాదు రోడ్డుకడ్డంగా వాహనాలు నిలిపేసినా పట్టించుకునే నాథుడే లేడు. ఇక్కడ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల హోటల్ అమరావతి వద్ద నిలిచే వాహనాలు చూస్తే నోరెళ్ళబెట్టాల్సిందే. ఇటు ఆర్టీసీ బస్సులు బయటకు లోపలికి తిరిగే స్థలం. అందునా విజయవాడ-బెంగుళూరు రోడ్డు. లారీలు, ప్రయివేటు బస్సులు, కార్లు ఇలా వేలకొలది వాహనాలు నిత్యం గ్యాప్ లేకుండా ఎప్పుడు అటు ఇటు తిరుగుతూనే ఉంటాయి. అటువంటి రద్దీగా ఉన్న చోట ఇంత పెద్ద హోటల్ తగినంత కనీసం రెండు మూడు కార్లు కూడా పట్టేంత పార్కింగ్ స్థలం లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కొన్నికొన్ని సార్లు ఈ హోటల్ నిర్వహణ వల్ల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయిన ఉదంతాలు ఎన్నో లేకపోలేదు. వాహనాలు ఎంత ఆగితే అంత వ్యాపారం జరుగుతుంది అన్న చందాన కనిపిస్తుంది వీరి ధోరణి. ఈ కోవలోనే గ్రీన్ చిల్లీస్ డాబా, కొత్తగా వెలసిన అన్నపూర్ణ హోటల్. ఈ హోటల్ వాళ్ళు అందరికన్నా మేమెమన్న తక్కువ అన్నట్టు హోటల్ బోర్డు మరికొంత ముందుకొచ్చి పెట్టడం గమనార్హం. ఎప్పుడో ఇరవై ఏళ్ళ క్రితం ఇప్పుడున్న వాహనాలకు పది శాతం వాహనాలు కూడా లేనప్పుడు నిర్మించిన రోడ్డు ఇప్పుడున్న పరిస్థితుల్లో మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. కానీ ఉన్న ఆ కొద్దిపాటి రోడ్డునుకుడా వీరు వ్యాపారాల పేరిట అక్రమించేసి విపరీత ధోరణి ప్రదర్శిస్తున్నారు. పట్టణంలోని అడ్డంకులను తొలగించాల్సిన మునిసిపల్ శాఖకు ఇలాంటివి కనిపించటంలేదా అంటూ పట్టణ ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. పోనీ పోలీసులన్న అటు చూస్తారా అంటే వారికసలు అవసరం లేనట్టు కనిపిస్తుంది. కనీసం నాయకులైన పట్టించుకుంటారా అంటే అదీ లేదు. ఎందుకంటే అక్కడ వ్యాపరాలు చేస్తున్నవారిలో సగానికి పైగా వారి బంధు వులు, అనుచరులే. ఇలా ఈ కారణంగానే అధికారులు నాయకుల కోసం వారి బాధ్యత నిర్వర్తించకుండా ఒకరిపైఒకరు చెప్పుకుంటు కాలం గడిపేస్తున్నారే తప్ప సమస్యలకు పరిష్కారం చూపటం లేదన్నది కనిపిస్తున్న వాస్తవం. ప్రమాదాలు జరిగి ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తకముందే అధికారులు కళ్ళు తెరచి ఇలాంటి ప్రమాదకరమైన అడ్డంకులను తొలగించాలని వాహనదారులు ప్రజలు వేడుకుంటున్నారు.

ఎస్వీయూలో 'రెక్టార్ రేస్'

'అధిష్టానం' చుట్టూ ఆశావహులు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రెక్టార్ రేస్ మొదలైంది. ఇప్పటివరకు విశ్వవిద్యాలయం రెక్టార్‌గా కొనసాగిన వర్సిటీలోని మనో విజ్ఞాన శాస్త్రం విభాగం అధ్యాపకులు ఆచార్య వంగిమల్ల శ్రీకాంత్ రెడ్డి డిసెంబర్ 31 వ తారీఖున పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఎస్వీయూలో రెక్టార్ పదవి ఖాళీ ఏర్పడింది. సాధారణంగా విశ్వవిద్యాలయాలలో రెక్టార్ పదవి చాలా కీలకమైనది. వర్సిటీని అభివద్ధి పథంలో నడిపించే పలు ముఖ్య అంశాలైన బోధన, పరిశోధన, పరీక్షల నిర్వహణ, సకాలంలో ఫలితాల విడుదల, అనుబంధ కళాశాల గుర్తింపు, పనితీరు, నూతన పోకడలకు అనుగుణంగా పాఠ్యాంశాలలో మార్పులు చేర్పులు చేయడం వంటి కీలకమైన బాధ్యతలను రెక్టార్ నిర్వహించాల్సి ఉంటుంది. అంతేకాకుండా వర్సిటీకి సంబంధించిన అకడమిక్ క్యాలెండర్‌ను ఒక క్రమ పద్ధతిలో రూపొందించి సక్రమంగా అమలు పరచడమూ రెక్టార్ బాధ్యతే. వర్సిటీ పేరు, ప్రతిష్టలను ఇనుమడింపజేసే పై కీలకమైన అంశాలను దష్టిలో ఉంచుకుని వర్సిటీ అధికారయంత్రాంగం బోధన, పరిశోధన రంగాలతోపాటు అకడమిక్ అంశాలపై మంచి అవగాహన కల్గిన వ్యక్తిని రెక్టార్ గా నియమించాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

పలువురు ఆశావాహులు ... ?

రెక్టార్ పదవి దక్కించుకునేందుకు పలువురు ఆశావాహులు ఇప్పటికే మంత్రి ఇలాకాల చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఎస్ వి యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం. శ్రీనివాసులురెడ్డి తీవ్రస్థాయిలో రెక్టార్ పోస్టు కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఆయన ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని కావలి పిజి సెంటర్ కు ఇన్చార్జిగా విధులను నిర్వహించారు. ప్రస్తుతం ఈయన ఎస్ వి యు సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేస్తున్నారు. ఫిబ్రవరి మాసం చివరిలో ఈయన పదవి విరమణ అవుతారు. రెండు నెలల కాలమైనా రెక్టార్ పదవి చేయాలని పూర్తిస్థాయిలో పావులు కదుపుతున్నట్లు వర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే వర్సిటీలో పలు సామాజిక కేటగిరీ అంశాల్లో సీనియర్ అయిన ఆచార్యులు రెక్టార్ పదవి రేసులో ముందున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గతంలో రెక్టార్‌గా పనిచేసి, ఇన్చార్జి ఉప కులపతిగా పనిచేసి, ప్రస్తుతం ఎడ్యుకేషన్ విభాగాధిపతి, ఐఏఎస్ఈ ప్రిన్సిపల్, సోషియాలజీ విభాగం విభాగాధిపతి ఆచార్య జానకిరామయ్య, కామర్స్ విభాగపు సీనియర్ ఆచార్యులు డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు, ఎస్ వియు ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్, డీన్ ఆచార్య బివి మురళీధర్, ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యులు దామోదర్ రెడ్డి, భానుదయ రెడ్డి, చెంగయ్య, మేనేజ్మెంట్ కళాశాల నుంచి ఆచార్య పద్మావతి, ఆచార్య సర్దార్ గగ్లూత్, ఆచార్య సావిత్రమ్మ, ఆచార్య సిహెచ్ అప్పారావు వంటి పలువురు ఆశావాహులు నూతన సంవత్సరంలో తమకు పోస్ట్ కలసి వస్తుందని ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి వర్సిటీలో ఎలాంటి వివాదం లేని ఎంతో అనుభవం కలిగిన సీనియర్ ఆచార్యులను నియమించడం ద్వారా వర్సిటీని మరింత పురోగతిలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే కొందరు ఆశావాహులు రెక్టార్ పదవి కోసం మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇళ్ల చుట్టూ పహారా కాస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో ఆచార్యుల పై ఎటువంటి ఆరోపణలు వచ్చినా వారిని రెక్టార్ పదవీలో తీసుకోకపోవచ్చు అని మరికొందరు వర్సిటీ క్యాంపస్ లో గుసగుసలాడుతున్నారు. వివాదరహితుడు, అత్యంత అనుభవం కలిగిన ఆచార్యులను మాత్రమే ఈ పోస్టులో తీసుకుంటారని మరొక భావన ఉంది.

తిరుమలలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ ధనంజయ వై.చంద్రచూడ్ రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం తిరుపతికి చేరుకున్నారు. ఆయనకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఏపీ హైకోర్టు లక్ష్మణరావు, ఉమ్మడి జిల్లా జడ్జి భీమరావు, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్పి పరమేశ్వర్‌రెడ్డి, జేసీ డీకే బాలాజీ, మూడో అడిషనల్ జిల్లా జడ్జి వీర్రాజు, ప్రోటోకాల్ మేజిస్ట్రేట్ కోటేశ్వరరావు, శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు, అడిషనల్ ఎస్పి కులశేఖర్, జిల్లా బార్ కౌన్సిల్ ప్రెసిడెంట్ దినకర్ స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. రోడ్డుమార్గంలో నేరుగా తిరుమలకు వెళ్లిన ఆయన బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు.

వైకుంఠ దర్శనానికి అన్ని ఏర్పాట్లు

- శ్రీవారి దర్శనానికి టోకెన్ తీసుకునే రండి
- భక్తులు తప్పని సరిగా మాస్క్ ధరించాలి
- జనవరి 1, 2 తేదీల్లో సిఫార్సు లేఖలు రద్దు
- టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి వెల్లడి

ప్రజాశక్తి- తిరుమల

సామాన్య భక్తులకు ఎక్కువ సంఖ్యలో వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలనే ఉద్దేశంతో జనవరి 2 నుండి 11వ తేదీ వరకు 10 రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలని బోర్డు నిర్ణయం తీసుకుందని టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి చెప్పారు.ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన తెలిపారు. ఈవో అనిల్ కుమార్ సింఘాల్ , జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి , అదనపు ఈవో వీరబ్రహ్మం , జేఈవో సదా భార్గవి, టీటీడీ సీవీఎస్వో నరసింహ కిషోర్ , జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి ఇతర అధికారులతో మంగళవారం సాయంత్రం తిరుమల అన్నమయ్య భవనంలో ఆయన వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. అనంతరం చైర్మన్ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో దాదాపు 92 కౌంటర్ల ద్వారా. సర్వదర్శనం టోకెన్లు జారీ చేయడం జరుగుతుందన్నారు.టోకెన్ కేంద్రాల వద్ద

భక్తుల కొరకు అన్నప్రసాదాలు, మంచినీరు, పాలు, టి, కాఫీ అందిస్తామని, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలోని గిరిజన, వెనుకబడిన ప్రాంతాలకు చెందిన పేదవర్గాల వారికి రోజుకు వెయ్యి మంది చొప్పున 10 రోజులకు కలిపి సుమారు 10 వేల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తా మన్నారు. భక్తులకు అవసరమైన ప్రాంతాల్లో వైద్యసేవలందించేందుకు వైద్య బృందాల ఏర్పాటు. అదనంగా 3 డిస్పెన్సరీలు, 1 మొబైల్ డిస్పెన్సరీ ఏర్పాటు చేస్తాం. టిటిడి సెక్యూరిటీ, పోలీసుల సమన్వయంతో తిరుపతి, తిరుమలలో తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టడం జరిగింది. పార్కింగ్ ప్రాంతాలపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఎస్పి, సీవీఎస్వోకు సూచించామన్నారు.

మానవీయ విలువలతోనే..

నిజమైన సమాజాభివృద్ధి

డీన్ బీవీ మురళిధర్

ప్రజాశక్తి - క్యాంపస్ : భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో " విద్యలో నైతిక విలువలు " అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య బివి.మురళిధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యా విధానంలో మానవీయ విలువలు పెరుగుదలకు ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్న సమాజంలోని అభద్రతా భావం ఫలితంగా సాధ్యపడట్లేదని పేర్కొన్నారు. మానవ సంబంధాలు, వ్యక్తిగత అభిప్రాయాలు సమాజాన్ని ప్రభావితం చేయడం ఫలితంగా సంస్థలు ఆశించిన పురోగతి సాధించడం లేదన్నారు. విద్యార్థి దశలోనే విద్యార్థులు తోటి వ్యక్తులను గౌరవించడం, ఎన్ని కష్టాలు వచ్చిన నిజాయితీగా మెలగడం లాంటి భావనలు అలవరుచుకోవడం వలన సమాజాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొని వెళ్ళడం సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులను చైతన్యపరచడానికి, సమాజ సేవ చేయడంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి, కార్యదర్శి మాధవ్, ఆఫీస్ బేరర్స్ అక్బర్, ఉరుకుంద, హరిత, నాయకులు పృథ్వి, రవి, సునీల్, శివ, ఆకాష్, హంపయ్య, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'గంగ' సరఫరా బంద్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:

నగరంలో తెలుగుగంగ నీటి సరఫరా బుధవారం వుండదని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరానికి తెలుగుగంగ నీటిని సరఫరా చేస్తున్న ప్రధాన నీటి పైపు మంగళం వద్ద లీకేజ్ అవుతున్నదని, బుధవారం మరమ్మతులు చేసి గురువారం నుండి యధావిధిగా సరఫరా వుంటుందని మోహన్ తెలియజేసారు.

నేడు కుప్పంలో కార్మిక చైతన్య యాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:

జనవరి 2 నుంచి 4 వరకు భీమవరంలో సిఐటియు రాష్ట్ర 16వ మహా సభలు ప్రారంభమ వుతున్న నేపథ్యంలో రాష్ట్రంలోని మూడు కేంద్రాల నుంచి సిఐటియు రాష్ట్ర జాతాలు ప్రారంభం కానున్నాయని సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో తెలిపారు. 28వ తేదీ ఉదయం కుప్పంలో జాతాను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. అజయ్ కుమార్ ప్రారంభిస్తారని, హిందూపురం నుంచి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ ప్రారంభిస్తారని, శ్రీకాకుళం జిల్లా మందస నుంచి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు, సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు బేబీ రాణిలు ప్రారంభిస్తారని తెలిపారు. కుప్పం నుంచి ప్రారంభమయ్యే జాత 28వ తేదీ బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు తిరుపతి చేరుకుంటుందని హరే రామ హరే కష్ణ రోడ్డులోని అటవీ కార్మికుల నిరాహార దీక్షా శిబిరం వద్ద సభను నిర్వహిస్తామని, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం జాత అన్నమయ్య జిల్లాకు వెళుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. జాతకు సీఐటీయూ రాష్ట్ర నేతలు పి. అజయ్ కుమార్, కటారి అజయ్ కుమార్, దయా రమాదేవిలు నాయకత్వం వహిస్తారని తెలిపారు.

తోపుడుబండ్ల వద్ద అక్రమ గేటు వసూళ్లు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ :

నగరంలో తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న వారి దగ్గర నుంచి దౌర్జన్యంగా నిబంధనలకు వ్యతిరేకంగా గేటు పేరుతో వసూళ్లు చేస్తున్న డబ్బును అరికట్టాలని హాకర్స్ యూనియన్ నగర కార్యదర్శి పి.బుజ్జి, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం యశోదానగర్‌లోని సిఐటియు కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ నగరంలో మూడువేల మందికి పైగా తోపుడుబండ్ల వ్యాపారులు ఉన్నారని, అయితే వీరి నుంచి నిబంధనలకు విరుద్ధంగా దౌర్జన్యంగా తోపుడుబండ్ల వ్యాపారుల నుంచి అక్రమ గేటు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. టెంకాయల వ్యాపారం చేసుకుంటున్న వారి నుంచి టెంకాయ చిప్పలను మున్సిపల్ అధికారులు తరలించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర ఆఫీసు బేరర్లు టి.మురళి, మునిరత్నం, శోభ, ఈవ్వరయ్య, రమణ, నరేంద్ర పాల్గొన్నారు.

కెరటం నాకు ఆదర్శం : మంత్రి ఆర్‌కె రోజా



యూత్ ఫెస్టివల్‌లో మంత్రి ఆర్కే రోజాను ఘనంగా సన్మానిస్తున్నకళాశాల ఛైర్మన్ బాలాజీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్వామి వివేకానంద చెప్పినట్టు "కెరటం నాకు ఆదర్శం.. లేచి పడుతున్నందుకు కాదు, పడినా లేస్తున్నందుకు" అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. పుత్తూరు మునిసిపాలిటీ పరిధిలో చిన్నరాజు కుప్పం వద్ద ఎస్.వి.పి.సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా యూత్ ఫెస్టివల్ ను మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు' అని అన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని సాధించేందుకు ఎన్నిసార్లైనా ప్రయత్నించాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన నత్య ప్రదర్శనలు అహుతులను అలరించాయి.ఈ కార్యక్రమంలో సెట్విన్ సీఈఓ మురళీకష్ణ, ఎస్.వి.పి.సెట్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బాలాజీ, పుత్తూరు మున్సిపల్ చైర్మన్ ఏ హరి. వైస్ చైర్మన్లు. డి శంకర్. డి జయ ప్రకాష్, కౌన్సిలర్లు, జానకి కెనడి. మున్సిపల్ కమిషనర్ కే ఎల్ ఎం ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి - తిరుమల



వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళ వారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఆలయ శుద్ధి అనంతరం స్వామి సర్వదర్శనానికి భక్తులను అనుమతించారు. వచ్చే నెల 2వ తేదీన వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరు మంజనం కార్యక్రమాన్ని టీటీడీ శాస్త్రోక్తంగా నిర్వహించింది. ఉదయం 6 నుంచి 11 గంటల వరకూ ఆలయ శుద్ధి కొనసాగింది. ఏడాదిలో నాలుగుసార్లు.. ఉగాది, ఆణివారి ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం రోజున కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సందర్భంగా ముందుగా స్వామి వారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచారు. ఆనంద నిలయం నుంచి బంగారు వాకిలి వరకు.. శ్రీవారి ఆలయం లోపల ఉన్న ఉపాలయాలు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి వంటి అన్ని వస్తువులను నీటితో శుభ్రం చేశారు. శుద్ధి కార్యక్రమం పూర్తయిన తర్వాత నామపుకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చకర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలు కలిపిన పరిమళ ద్రవ్యాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామి వారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేకపూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు చేపట్టారు. పూజా కార్యక్రమాల తర్వాత ఉదయం 11 గంటలకు స్వామి వారి సర్వదర్శనానికి భక్తులను అనుమతించారు.

ఏడాదిలో నాలుగుసార్లు ఆలయ శుద్ధి చేపట్టడం ఆనవాయితీ వస్తోందని టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 9 కౌంటర్లలో వైకుంఠ ద్వార దర్శనాలు జారీ చేస్తున్నట్లు చెప్పారు. రోజుకు 50వేల టిక్కెట్ల చొప్పున సర్వదర్శనం టైం స్లాట్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. 5 లక్షల టిక్కెట్లు పూర్తయ్యే వరకు జారీ కొనసాగుతుందన్నారు.

పలు చోరీలకు పాల్పడిన దొంగ అరెస్టు

రూ.32 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి రూ.32 లక్షలు విలువజేసే సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి అర్బన్ ఎస్పి పి.పరమేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా వెంకటగిరి పట్టణంలో సంచలనం సృష్టించిన నగల దుకాణంలో జరిగిన చోరీ కేసును పోలీసులు చాకచాక్యంగా చేధించారన్నారు. బాలాయపల్లి మండలం జయంపు గ్రామం హరిజనవాడకు చెందిన మేకతోట్టి వెంకయ్య (22) చెడు వ్యసనాలకు బానిసై అప్పులుపాలయ్యాడు. వాటిని తీర్చేందుకు దొంగతనాలకు పాల్పడేవారన్నారు.

ఈ నెల 9వ తేది రాత్రి వెంకటగిరిలోని ఎల్‌వి నాయుడు నగల దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తి వెనుకవైపు గోడకు కన్నెం వేసి, అందులోని 600 గ్రాముల బంగారు నగలు, 5 కేజీల వెండి వస్తువులు, 50వేల రూపాయలు నగదు దోచుకెళ్లాడు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు వెంకయ్యగా గుర్తించారు. ఈ నెల 27వ తేది ఉదయం బాలాయపల్లిలోని అలిమిలి గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద అనుమా నంగా తిరుగుతున్న నిందితుడుని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో వెంకటగిరిలో నగల షాపు చోరీతో పాటు బాలాయపల్లిలో తాళం వేసి ఉన్న ఇంటిలోకి ప్రవేశించి బీరువాలో ఉన్న నగులు, నగదు దోచుకెళ్లినట్లు పోలీసుల విచారణలో వెల్లడింది. నిందితుడి వద్దనుంచి 637 గ్రామల బంగారు నగలు, 25 కేజీల బంగారు నగలు, రూ.13వేల నగదుతో పాటు ఒక ఆటో, నేరానికి ఉపయోగించిన ఇనుప చువ్వను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇతనిపై కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించినట్లు వెల్లడించారు. నిందితుడు అరెస్టు, సొత్తు స్వాధీనంలో సహకరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అయన అభినందించారు.

నాయుడుపేట ఐద్వా కార్యదర్శిగా చంద్రకళ

ప్రజాశక్తి- నాయుడుపేట:

నాయుడుపేట మండల ఐద్వా కన్వీనింగ్ కమిటీ మంగళవారం ఏర్పాటయ్యింది. కమిటీకి కార్యదర్శిగా చేజర్ల చంద్రకళను ఎన్నుకున్నారు. సుందరరామిరెడ్డి భవన్‌లో జరిగిన ఐద్వా జనరల్‌బాడీ సమావేశానికి ముఖ్య కార్యదర్శిగా ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ గతంలో భర్త సంపాదనకు, భార్య వంట చేయడానికి అనేవారని, ప్రస్తుతం ఇద్దరూ పనిచేస్తే గానీ కుటుంబం గడవడం కష్టంగా ఉందన్నారు. స్త్రీలు మగవారితో సమానంగా పనిచేస్తున్నా భద్రత లేకుండా పోయిందన్నారు. చిన్నపిల్లల నుంచి 60 ఏళ్లకు పైబడిన మహిళలపై అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని, స్త్రీలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శివకవి, ముకుంద, ఐద్వా సభ్యులు దేవి, అంకమ్మ, సిద్దమ్మ, నాగమణి పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఓటరు జాబితా అవకతవకలపై...

హైకోర్టులో కేసు విచారణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల జాబితాపై ఏపీ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లోని ఓటర్ల లిస్టులో అనర్హులని చేర్చారంటూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. ఈపీఐఎఫ్ వివరాలను ఎందుకు పొందుపరచలేదని సూచించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాల ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఓటరు జాబితాలో అవకతవకలు చోటు చేసుకున్నాయని యూటీఎఫ్ ఆరోపించింది. ఉపాధ్యాయులు కాకుండా జాబితాలో చేర్చిన అనర్హులను తొలగించాలని యూటీఎఫ్ ఏపీ హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేసింది. వచ్చే ఏడాది మార్చి 29న రాష్ట్రంలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ఐదుగురు సభ్యులు 2023 మార్చిలో రిటైర్ కానున్నారు. దీంతో ఈ ఐదు స్థానాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియను ఎన్నికల సంఘం ప్రారంభించింది.

ఈ ఏడాది నవంబర్ 7వ తేదీ నుండి ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును నమోదు చేసుకొనే వెసులుబాటును ఈసీ కల్పించింది. అయితే ఈ ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి చెందిన ఓటరు జాబితాలో అవకతవకలు చోటు చేసుకున్నాయని యూటీఎఫ్ ఆరోపించింది. ఈ విషయమై ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అనర్హులను ఓటరు జాబితాలో చేర్చినట్టుగా యూటీఎఫ్ నేతలు ఆ పిటిషన్ లో పేర్కొన్నారు. ప్రకాశంలో 50, చిత్తూరులో 30, నెల్లూరులో 50 శాతం జాబితాలో మార్పులు చేశారని యూటీఎఫ్ ఆ పిటిషన్ లో ఆరోపించింది. ఉపాధ్యాయ ఓటరు జాబితాలో అనర్హుల పేర్లను తొలగించాలని ఆ పిటిషన్ లో యూటీఎఫ్ నేతలు కోరారు.

దళారులను నియంత్రిద్దాం: అంజూరు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : స్థానిక శ్రీకాళహస్తీశ్వ రాలయంలో దళారీ వ్యవస్థ లేకుండా సమూలంగా నియంత్రిద్దామని ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక ఆలయ పరిపాలన భవనంలో బదిలీలపై నూతనంగా బాధ్యతలు చేపట్టిన హోంగార్డులతో మంగళవారం ఆయన సమావేశ మయ్యారు. ఆలయ భద్రత, క్యూలైన్ల పర్యవేక్షణ, ఇతర అంశాలపై హోంగార్డులతో సమీక్షించారు. కంచికడప వద్ద నుంచి నాలుగు గోపురాలు వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని, సెక్యూరిటీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పొరపాట్లు లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఆలయంలో దళారులను సంపూర్ణంగా కట్టడి చేయాలని, భక్తులను మోసగిస్తూ దర్శనాల పేరిట దందాలు సాగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని ఆదేశించారు. ఆలయంలోకి ఏ ఒక్కరు కూడా సెల్‌ఫోన్లు తీసుకుని వెళ్లకుండా చూడాలని సూచించారు.

సచివాలయ కన్వీనర్ల నియామకం

ప్రజాశక్తి - బిఎన్‌కండ్రిగ: మండల కేంద్రంలో మంగళవారం మండల కన్వీనర్ ఆరని విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి అధ్యక్షతన సచివాలయ కన్వీనర్ల నియామకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్యవేడు శాసనసభ సభ్యులు కోనేటి ఆదిమూలం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాలను రాజకీయ చరిత్రలోనే ఏ ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టలేదని మునిపెన్నడూ కూడా ప్రవేశపెట్టబోరని కొనియాడారు. కొత్తగా ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్ల చొప్పున నియమిస్తున్నట్లు తెలియజేశారు. జనవరి 1నుంచి 4 వరకు పెన్షన్ల నమోదు కార్యక్రమం, 5,6 వ గృహసారధుల నియామకమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీవ మేకల సుబ్బలక్ష్మి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, గోపాల్ రెడ్డి, సుందర్ రెడ్డి, ఇమామ్ భాష, ఎంపీటీసీ రవి, కొత్తపాలెం సర్పంచ్, కేతారి శుభ రత్నమ్మ, హరిప్రసాద్, ప్రసాద్ పాల్, అజయ్ రెడ్డి, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - ఓజిలి : మండలంలోని ఎనిమిది గ్రామంలో రీ సర్వే పనులు చేపడుతున్నట్లు తహశీల్దారు డి.లాజరస్ మంగళవారం పేర్కొన్నారు. మండల పరిధిలోని కర్రబల్లవోలు, సగుటూరు, నెమళ్ళపూడి, గ్రద్దగుంట, మాచవరం, విజయనెల్లూరు, రుద్రాయపాలెం, భువనగిరిపాలెం గ్రామాలలో ఈనెల 28వ తేదీ నుండి భూ రీ సర్వే పనులు చేపడుతున్నామని పొలాలు కలిగిన రైతులు తప్పనిసరిగా వారి వారి పొలాల వద్దకు వెళ్లి సర్వే అధికారులకు సహకరించాలని తహశీల్దార్ డీ.లాజరస్ తెలియజేశారు. పైన పేర్కొన్న గ్రామాలలో పొలాలు కలిగి ఉన్న రైతులు బయట ప్రదేశాల్లో ఉంటే వారు కూడా తప్పనిసరిగా పొలాల వద్ద ఉండాలని తెలిపారు. వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వే అధికారులకు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: పంచాయతీల్లో మౌలిక సదుపాయాలపై అలసత్వం వద్దని పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీర్లకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు జిల్లా పంచాయతీ అధికారి ఆదెం రాజశేఖర్ రెడ్డి సూచించారు. ఎంపిపీ బాలం యుగందర్ రెడ్డి అధ్యక్షతన, ఎంపిడిఓ కె.దేవేంద్రబాబు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్ రెడ్డి పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. తాగునీరు, చేతిపంపుల రిపేర్, మురుగు కాల్వల శుభ్రత, క్లోరినేషన్, ఇంటిపన్నుల వసూలు వంటివాటిపై మైక్రో లెవల్లో సమీక్షించి పలు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమానికి పంచాయతీ సెక్రటరీ, ఈఓఆర్డీ మదనమోహన రాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ గొప్ప విద్యావేత్త

ప్రధానోపాధ్యాయురాలు షకీనమ్మ

ప్రజాశక్తి -క్యాంపస్ : భారతదేశం, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక వంటి పలు దేశాలకు జాతీయ గీతాన్ని అందించిన గొప్ప మేధావి విద్యావేత్త ఆచార్య రవీంద్రనాథ్ ఠాగూర్ అని ఎస్వీయు క్యాంపస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షకీనమ్మ పేర్కొన్నారు. శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం క్యాంపస్ పాఠశాలలో మంగళవారం డిసెంబర్ 27వ తేదీని పురస్కరించుకొని జనగణమన గీతాన్ని ఆలపించారు. స్వాతంత్ర స్ఫూర్తిని, జాతీయత భావాన్ని రగిలించిన జనగణమన గేయం మన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లి బీటీ కళాశాలలో పురుడు పోసుకోవడం మనకు ఎంతో గర్వకారణ మని పేర్కొన్నారు. ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

అప్రమత్తంగా రీ సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి -బాలాయపల్లి : మండలంలోని 12 గ్రామాల్లో జరుగుతున్న రెండో విడత జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా ఎంపికైన 12 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాలని జిల్లా సర్వే, లాండ్ రికార్డ్స్ అధికారి పి.వి జయరాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రం రీ సర్వే పై రెవిన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కగా సర్వే చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు తహశీల్దారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి అక్రమాలు జరగకుండా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు అజ్మతుల్లా ఖాన్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే గూడూరు, రఘురామరాజు, ఎంపిడిఓ వినీల్ కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేలు చంద్రబాబు, వాసు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెన్షన్...టెన్షన్...

- పాతవి తొలగించేందుకు ఆదేశాలు
- కొత్తవి ఇచ్చేందుకు సన్నాహాలు

ప్రజాశక్తి -బాలాయపల్లి :

ఇప్పటి వరకు 1వ తేదీ వస్తే పెన్షన్ వస్తుందని వృద్ధులు ఆశతో ఎదురుచూసేవారు. కానీ ఇప్పుడు ఫించను వస్తుందని అనుకునే వారు నిబంధనలతో ఎక్కడ తమకు వస్తున్న ఫించను నిలిపేస్తారన్న టెన్షన్ మొదలైంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభు త్వం పింఛన్ల ఏరివేతకు సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి ఇవ్వడం జరిగింది. ప్రతి సచివాలయ పరిధిలో 5 నుంచి 15 పింఛన్లు కోత వాటి స్థానంలో జనవరిలో కొత్త పింఛన్లు విద్యుత్ బిల్లుల సాకుతో ఏరివేతకు ప్రణాళిక సిద్ధం చేసింది. మండలంలో 76 మంది వృద్ధులకు విద్యుత్, భూమి ఉందని పట్టణంలో 1000 చదరపు అడుగులు స్థలం ఉందని, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నట్లు, 4 చక్రాలు వాహనం ఉందని పలు షరతులతో నోటీస్సులు జారీ చేశారు.

ఉన్న పింఛను తీసి....కొత్తవి మంజూరు :

షరతులు పెట్టడం, వస్తున్న పింఛను తొలగించి... నోటీసులిచ్చి తొలగించేందుకు సర్వం సిద్ధం చేసి... ప్రజల కన్నీళ్ళు తుడిచేందుకు కొత్త ఫించన్లు ఇస్తామని ప్రభుత్వం మభ్యపెడుతోంది. 'ఒక ప్రాణం తీశా.. మరో ప్రాణం పోశా.. లెక్కసరిపోయింది' అంటూ ఓ సినిమాలో విలన్ చెప్పిన డైలాగ్ సామాజిక పింఛన్ల మంజూరులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు అతికినట్లు సరిపోతుంది.

కొత్త ఫించన్లు ఎక్కడ :

ప్రతి ఆరు నెలలకోసారి కొత్త పింఛన్ల మంజూరు చేస్తామని అధికార ప్రభుత్వం చెప్పింది. అయితే ఆరు నెలలకోసారి విద్యుత్ బిల్లులతో పాటు అనేక సాకులు చూపుతూ ఉన్న పింఛన్లను తొలగించే ప్రక్రియకు సైతం ప్రభుత్వం పూనుకుంటుంది. జనవరిలో కొత్త పింఛన్లు మంజూరు చేయాల్సి ఉంది. మండలంలో వస్తున్న వివిధ రకాల ఫించన్లు 3,642 మందికి వస్తున్నాయి. వీటిలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులు వంటి పలు రకాల పింఛన్లు ఉన్నాయి. అర్హత ఉండి కూడా అనేక మందికి పింఛన్లు అందని పరిస్థితి ఉంది. వీరంతా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుని ఆరు నెలలుగా ఎదురు చూస్తున్నారు. ఇలాంటి వారు చాలా మంది పింఛన్లకు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఉన్నవి పీకీ....కొత్తవి ఇస్తాం:

కొత్త పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం ఉన్న పింఛన్లను తొలగించేందుకు పూనుకుంది. పింఛను అందుకుంటున్న వారి కరెంటు బిల్లులను ఆరు నెలల సరాసరి పరిశీలించి 300 యూనిట్లు దాటితే పింఛన్ నిలిపివేస్తోంది. ఈ కాలంలో ఇంట్లో ఏదైనా వివాహం, వేరే వేడుకలు జరిగి విద్యుత్ బిల్లు పెరిగితే పింఛన్ ఆగిపోయినట్టే. ఇలా పలు నిబంధనలను తెరపైకి తెచ్చి పింఛన్లను ఆపేస్తోంది. పరిశీలన పేరుతో ప్రతి సచివాలయ పరిధిలో ఐదు నుంచి 15 పింఛన్లు వరకూ ఏరివేత జాబితాలో చేరాయి. మండలంలో పింఛన్లు నిలిచిపోయే పరిస్థితి ఉంది. ఏరివేత జాబితా సంఖ్య గురించి ఏఒక్క అధికారీ సమాధానం చెప్పని పరిస్థితి నెలకొంది. 20, 30 ఏళ్ల క్రితం కట్టిన ఇళ్లకు విద్యుత్ మీటర్లన్నీ దాదాపుగా ఇంటి పెద్ద పేరుపైనే ఉన్నాయి. కుమారులు ఆ ఇంట్లో ఉంటున్నప్పటికీ పింఛన్ అందుకుంటున్న వ్యక్తి పేరుపైనే విద్యుత్ మీటర్ నడుస్తోంది. కుమారులు విద్యుత్ వాడుకుంటే ఏ సంబధం లేని వృద్ధుల పింఛన్ ఆపేస్తున్నారు. ఇలాంటివి అనేక ఇబ్బందులు ఉన్నాయి.

పరిశీలిస్తున్నాం.. ఫించన్లు వస్తాయి..

మండలంలో వివిధ పింఛన్లకు సంబంధించిన 74 మందికి సచివాలయం సిబ్బంది ద్వారా నోటీసులు ఇవ్వడం జరిగింది. అయితే వాటిల్లో అన్ని పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపి వచ్చేలా చూస్తాం.

- ఎంపీడిఓ వినిల్ కుమార్ బాలాయపల్లి మండలం

తొలగించిన ఫించన్లు వెంటనే పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- గూడూరు : పింఛనుదారుల కడుపు కొడుతున్న రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వారికి పెన్షన్ మంజూరు చేయాలని, తొలగించిన పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గూడూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలో భాగంగా ఒకటి "అవ్వ, తాతల పింఛను" పెంచుకుంటూ పోతానని చెప్పడం చెప్పిన నాలుగు సంవత్సరాలు కాలంలోనే, ఎసరు పెట్టడం దీర్ఘకాలికంగా పింఛను తీసుకుంటున్న వారిని జాబితాలో లేకుండా చేయడం, వాళ్ళ కడుపుకోతకు కారణమయ్యాడని వారు ఆరోపించారు. ఒంటరి, మహిళలు, వితంతువులు, పిల్లలు పోషణకు గురైన వృద్ధులు, దీర్ఘకాలికంగా అనారోగ్యాలతో బాధపడుతూ మందులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న వారికి చేయూతగా నిలవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పామంజి మని, ఆటో కార్మిక సంఘం జిల్లా నాయకులు బి.వి.రమణయ్య, మాజీ. కౌన్సిలర్ జి.శివయ్య, బి.చెంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్: తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ మంగళవారం గూడూరు మున్సిపల్ ఆఫీసు ఎదుట సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ అకారణంగా వృద్ధులు, వితంతువుల పింఛన్లు రద్దు చేయడం అన్యాయమన్నారు. రద్దుచేసిన పింఛన్లు మళ్లీ ఇచ్చేంత వరకూ పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్. కాలేషా, జిల్లా సమితి సభ్యులు సీవీఆర్. కుమార్, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కే. నారాయణ, ఎంబేటి చంద్రయ్య, ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు బాలాజీ, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ :రాష్ట్రంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇస్తున్న పెన్షన్లను వివిధ కారణాలతో తొలగించడం దారుణమని తక్షణమే ఆ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం మార్చుకొని యధావిధిగా పెన్షన్లను కొనసాగించాలని సిపిఐ పుత్తూరు పట్టణ కార్యదర్శి డి.మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మంగళవారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట పెన్షన్లను కొనసాగించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. . మున్సిపల్ కార్యాలయంలో అధికారులు వినతిపత్రం స్వీకరించకపో వడంతో గాంధీ విగ్రహానికి సమర్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కృష్ణారెడ్డి, సెల్వరాజ్ ఆచారి, గోపి, రమేష్, భాస్కర్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో నాక్ కమిటీ పర్యటన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో మంగళవారం మొదటి రోజు విశ్వ విద్యాలయాలకు గుర్తింపు ఇచ్చే నాక్ కమిటీ విస్తృతంగా పర్యటన సాగించింది. డా.ముత్తు కలింగం కృష్ణన్ వైస్ ఛాన్సలర్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడు, ఛైర్‌పర్సన్‌గా, ప్రొఫెసర్ హర్ష వటాటియ, ది మహారాజా సయాజి రావ్ యూనివర్సిటీ ఆఫ్ బరోడా, మెంబర్ కోఆర్డినేటర్‌గా, ప్రొఫెసర్ మౌనిక చావ్లా, పంజాబ్ యూనివర్సిటీ, ప్రొఫెసర్ సుధీరా చండేల్, దేవి అహల్య విశ్వవిద్యాలయ, ప్రొఫెసర్ సీమ వర్మ, డీన్ వనస్థలి విద్యాపీట్, ప్రొఫెసర్ ప్రియాంక గీత, బెనారస్ హిందూ యూనివర్సిటీ మెంబర్లుగా ఉన్న బృందం విచ్చేసింది. మంగళవారం ఉదయం 9 గంటలకు మహిళా యూనివర్సిటీలో ఎన్.టీ రామారావు విగ్రహం వద్ద ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం విద్యార్థినులు గౌరవ వందనంతో నాక్ బృందాన్ని ఆహ్వానించారు. యూనివర్సిటీ గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున నాక్ బృందంకు వివరించారు. గత ఐదు సంవత్సరాలలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, చేపట్టిన పలు మార్పులు, ప్లేస్మెంట్స్, ఫారెన్ కొలాబరేషన్, ఎం.ఓ.యూస్, తిరుపతి క్లస్టర్లో మహిళా యూనివర్సిటీ పాత్ర, వంటి అంశాలను వివరించారు. సావేరి సెమినార్ హాల్లో వివిధ విభాగాధిపతులు వారివారి డిపార్ట్మెంట్స్ గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నాక్ బృందంకు వివరించారు. ప్రజెంటేషన్ తర్వాత యూనివర్సిటీలో ఉన్న వివిధ విభాగాలను సందర్శించారు. కల్చరల్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.ఎన్.ఎస్ శైలేశ్వరి ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగిన కల్చర్ కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు.

విద్యార్థులకు 'బైజూస్' ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి-తడ: మండలంలోని తడ జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భందా శాసన సభ్యులు కిలివేటి సంజీవయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. మండలంలోని 383 మంది విద్యార్థులకు, 49మంది ఉపధ్యాయులకు ఈ ట్యాబ్‌లను అందజేశారు. మండల విద్యాశాఖాధికారి ఇందిరా, వైసీపీ మండల పరిషత్ అధ్యక్షులు రఘు రెడ్డి, తడకండ్రిగ సర్పంచ్ జయప్రద, జెడ్పీటీసీ ఇందుమతి, ఉపాధ్యక్షులు వెంకటేష్, రమేష్, ఎంపిడిఓ మురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు మల్లిఖార్జున రావు, నరసింహా రావు, కామేశ్వరరావు, శ్రీనివాసులు రావు, ఫణివేణి, సౌజన్య,సి ఆర్‌పి సిబ్బంది, తల్లి దండ్రులు విద్యార్థులు,విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్: మండలంలోని విందూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.జయరాం నాయుడు, 8వ తరగతి విద్యార్థులకు "బైజూస్ టాబ్‌లు" పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది జోసెఫ్, సురేష్, బాలమురళి, మురళికృష్ణ, చంద్రశేఖర్, పుల్లంరాజు, దయాకర్, కృష్ణారావు, కామాక్షి, భవానీ, పీడీ కరీముల్లా, సీఆర్‌పీ శ్రీనివాసులు తదిఓఇఛైర్మన్ శంకర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ దాము, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఒక కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవి రెడ్డి, వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బాలాజీ రెడ్డి, ఎంపిటిసి బాలయ్య 58 మంది విద్యార్థులకు ట్యాబ్లు అందజేశారు.

పిచ్చాటూరు : మండలంలోని పులిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజేంద్ర ముఖ్య అతిథిగా పాల్గొని ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మూర్తి, పాఠశాల ఛైర్మన్ శంకర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ దాము, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కాలువ స్థలంలో అక్రమ కట్టడాలు

ఆక్రమణలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోగల తిరుమల నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెంచులక్ష్మీ యానాది కాలనీ దిగువ భాగంలో ఉన్న కాలువ పోరంబోకు స్థలంలో మంగళవారం కొందరు అక్రమ నిర్మాణాలను చేపట్టారు. తిరుమలనగర్, మంగళం గ్రామ పంచాయతీల మధ్య భూభాగంలోని పెద్ద కాలువ మంగళం ఆర్టీసీ డిపోకు వెనుక భాగంలో ప్రవహించి, చెన్నాయిగుంట చెరువుకు చేరుతుంది. శేషాచలం అడవుల నుంచి వర్షాకాలంలో పెద్ద ఎత్తున వచ్చే వరద నీరు అంతా కూడా ఈ కాలువలోనే ప్రవహిస్తుంది. ఈ కాలువ స్థలంలో కొందరు ఐదు ఇళ్లను నిర్మించే ప్రయత్నాలు ప్రారంభించడంతో విషయం తెలుసుకున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు. అర్బన్ రెవెన్యూ ఆర్ఐ జానీ భాషా ఆక్రమణలు తొలగించి, కాలువ పోరంబోకు స్థలంలో మళ్లీ అక్రమ నిర్మాణాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు. అయితే ఆక్రమణదారులు తాము ఈ స్థలాన్ని కొనుగోలు చేశామని చెప్పడం గమనార్హం. ఈ కాలువకు ఆనుకొని పద్మావతినగర్‌లో టిటిడి అధికారులు తిరుమల నిర్వాసితులకు గతంలో ఇళ్లను కేటాయించారు. గతంలో కూడా ఇక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టిన సమయంలో స్థానికుల ఫిర్యాదు మేరకు టిటిడి అధికారులు కూడా నిర్మాణాలను అడ్డుకొని తొలగించారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న పంచాయతీ పాలకులు

శిల్పగురుకు ఘన సన్మానం

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి : శిల్పగురు రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీనివాసులు రెడ్డిని వన్నెకుల క్షత్రియ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు జ్ఞానంబావారి బుజ్జి రెడ్డి మంగళవారం ఘనంగా సత్కరించారు. శాలువ, గజమాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్నెరెడ్డి కులంలో పుట్టి క్రమశిక్షణతో కలలపై పట్టు సాధించి, దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన శిల్పగురు అవార్డును అందుకోవడం జాతికి గర్వకారణమన్నారు. ఆయన మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మధురెడ్డి, జీవీకే రెడ్డి, శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మల్లెంబాకం మునికృష్ణారెడ్డి, చెంచురెడ్డి, కృష్ణారెడ్డి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోకి నాయీ బ్రాహ్మణులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రేణిగుంట పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు మంగళవారం వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో 40 కుటుంబాల వారు వైసీపీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైసీపీలో చేరుతున్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రధాత జగనే అని ప్రజలు నమ్ముతున్నారని కితాబిచ్చారు. రేణిగుంట పట్టణ నాయి బ్రాహ్మణ సంఘం ప్రెసిడెంట్ జి.నాగరాజు, సంతానం, శేఖర్, కరుణానిధి, ఆనంద్, భాస్కరయ్య, నిర్మల, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యపును కలిసిన సింగర్ రోల్ రైడా



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రముఖ సింగర్, బిగ్ బాస్ కంటెస్టెంట్ రోల్ రైడా మంగళవారం స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రోల్ రైడా ముక్కంటి దర్శనార్థం విచ్చేశారు. దర్శనానంతరం ఎమ్మెల్యే బియ్యపు మసూదన్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆయనకు కలంకారి జ్ఞాపికను బహుకరించారు.

కారనిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-బిఎన్‌కండ్రిగ: మండలంలోని కారని పంచాయతీలో వర్షాలను దృష్టిలో పెట్టుకొని వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు మందులు పంపిణీ చేశారు. మండలంలో గత కొన్ని వారాలుగా వర్షాలు అధికంగా కురవడం వలన సీజన్ జ్వరాలు ప్రబలకుండా మంగళవారం వైద్యాధికారుల ఆదేశాల మేరకు ఏఎన్ఎం హేమావతి, ఎం ఎల్ హెచ్ పి మనీషా, ఆశ వర్కర్ గంగమ్మల ఆధ్వర్యంలో వైద్య క్యాంపు నిర్వహించి వైద్య సేవలు అందించారు.

దేశం మెచ్చిన వాలంటీర్ వ్యవస్థ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన వాలంటీర్ వ్యవస్థను దేశం మొత్తం కొనియాడుతోందని శ్రీకాళహస్తి నియోజకవర్గం వైసీపీ పరిశీలకుడు చక్రపాణి రెడ్డి అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన ఏర్పేడు, తొట్టంబేడు మండలాల గ్రామ వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో సమావేశ మయ్యారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా వాలంటీర్లు ఎలా పనిచేస్తున్నారో ఈ సందర్భంగా గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారం నిలబెట్టుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్‌కి ఆరు నెలల జైలుశిక్ష

ప్రజాశక్తి -తడ : ప్రమాదంలో బాలిక మృతికి కారకుడైన డ్రైవర్‌కి సూళ్లూరుపేట మెజిస్ట్రేట్ మంగళవారం ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. తడ ఎస్ఐ జేపీ శ్రీనివాస్ రెడ్డి అందించిన వివరాల మేరకు 2018లో తడకండ్రిగ పంచాయతీ బోడి లింగాలపాడు గ్రామం వద్ద జాతీయ రహదారిపై రెండు వైపు వెళ్తున్న సంచార జాతులకు చెందిన వాహనాన్ని అదే మార్గంలో ప్రయాణించి వెనుక వైపు వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సంచార జాతులకు చెందిన ఏడాదిన్నర సంవత్సరాల బాలిక మృతి చెందింది. దీనిపై విచారణ నిర్వహించిన తడ పోలీసు వారు కారు ప్రమాదానికి కారకుడైన శ్రీకాళహస్తికి చెందిన హరికుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. విచారణ అనంతరం మంగళవారం సూళ్లూరుపేట మెజిస్ట్రేట్ అనిల్ కుమార్ లాయర్ స్వామి రెడ్డి వాదన అనంతరం నిందితునికి ఆరు నెల జైలుశిక్ష, రూ.6500లు ఫైన్ విధిస్తూ తీర్పు వెల్లడించారు.

ఈకేవైసీ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - గూడూరు : రైతు భరోసా - పీఎం కిసాన్ నగదు 13వ విడత పొందాలంటే కచ్చితంగా ఈకేవైసీ చేసుకోవాలని గూడూరు మండల వ్యవసాయ అధికారి వి.రమేష్ తెలిపారు. ప్రభుత్వం రైతులకు మరొక అవకాశంగా డిసెంబర్ 31వ తేది వరకు గడువును పొడిగించింది, కావున ఇంకా ఈకేవైసీ చేసుకోని రైతులు ఎవరైనా ఉంటే చేసుకోవాలని అలాగే బ్యాంక్ అకౌంట్ ఎన్‌పిసిఐ లింక్ ఉండాలని తెలిపారు. రైతులు రైతు భరోసా కేంద్రాలలో తప్పక పంట నమోదు చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.గోపి నాయక్ తెలిపారు. మండలంలోని చెన్నూరు, విందూరులో పంట నమోదు కార్యక్రమాన్ని ఏడీఏ, ఏఓ పరిశీలించి, పంట నమోదుకు ఆర్‌బీకే సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శివ, దివ్య, నాగమణి, శైలేష్ పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: పీఎం కిసాన్ నిధి పథకం కింద ఏడాదికి 6 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం అర్హత గల రైతుల ఖాతాలలో జమ చేస్తుందని మండల వ్యవసాయ అధికారి ఖాదర్ భాషా మంగళవారం తెలిపారు. మండలంలో ప్రతి రైతుకు పిఎం కిసాన్ నిధి పథకం అర్హత సాధించాలంటే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని ఆయన తెలిపారు. ఇప్పటివరకు మండలంలో ఈకేవైసీ చేయించుకోని రైతులు సుమారుగా 1346 మంది ఉన్నారని తెలిపారు.

నేలపట్టులో గడపగడపకు మనప్రభుత్వం

ప్రజాశక్తి -దొరవారిసత్రం: మండల పరిధిలోని నేలపట్టు మైలాంగం గ్రామాలలో మంగళవారం సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే టీటీడీ బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి వారిని పలకరించి ప్రభుత్వం ద్వారా పొందిన అభివృద్ధి పథకాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ అందుతున్నాయని ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందామని తెలిపారు. గ్రామాలలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి వస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు సూళ్లూరుపేట చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి మండల సీనియర్ నాయకులు మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ జెడ్పిటిసి సభ్యులు రమేష్, ఎంపీడీవో సింగయ్య, ఎంఈఓ మస్తానయ్య, పొదుపు ఏరియా కోఆర్డినేటర్ మురళి, ఏపిఎం పద్మావతి, ఏపీఓ విజయభాస్కర్, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, నాయకులు ఓడూరు రమణారెడ్డి, సురేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మునస్వామి నాయుడు, నేలపట్టు సర్పంచి రామయ్య, తదితరులు పాల్గొన్నారు

శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని అమ్మపాలెం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మపాలెం పంచాయితీ పరిధిలో ఉన్న గ్రామల్లో పర్యటించి ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎవరికైనా ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్ రాజ్ కుమార్, మండల తహశీల్దార్ జరీనా బేగం, ఈ.ఓ.పి.ఆర్డి సురేంద్రనాథ్, శ్రీకాళహస్తి రూరల్ హౌసింగ్ ఏ.ఈ అలీ, అమ్మపాలెం గ్రామ సచివాలయ డిడిఓ భాస్కర్ వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం'

ప్రజాశక్తి-రేణిగుంట: వైసిపి ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి చేసిందేమీ లేదని రాష్ట్రం అప్పులతో ఉందని 20 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిపోయిందని రేణిగుంట టిడిపి మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి పట్టణాధ్యక్షుడు మహబూబ్ బాషా, డి.పుష్పనాథన్ అన్నారు.మంగళవారం శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశానుసారం రేణిగుంట మండలం జిపాలెం పంచాయతీ హరిజన వాడలో 'రాష్ట్రానికి ఇదేమి ఖర్మ' కార్యక్రమం చేపట్టారు. అలాగే పలు వీధుల్లో అలాగే స్థానికులను పరామర్శించారు. చిన్నారెడ్డి అనసంపల్లి వెంకట మునిరెడ్డి, మునస్వామి నాయుడు, దేవాళ్ళ రమణ మైనార్టీ నాయ కులు, అఫ్రోజ్‌నాయుడు, కృష్ణాపురం కుమార్, మండలనాయకులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : వైసీపీ పాలనలో దళితులకు తీరని అన్యాయం చేశారని, నిత్యవసర ధరలు పెంచేసి పేదల పొట్ట కొట్టారని, క్రిస్మస్ రంజాన్ కానుకలను రద్దు చేశారని నగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. నగరి మున్సిపాలిటీ 17వ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి ప్రజాభిప్రాయ పత్రాల మీద ప్రజా సమస్యలు అడిగి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఈఎన్ శ్రీనివాసన్, రాజా మాణిక్యం, బాలసుబ్రహ్మణ్యం,హరి క్రిష్ణ, రవి,అశోక్, ఆర్ముగం, కె.ఎం.రాజా లు పాల్గొన్నారు..

శ్రీకాళహస్తి: జగన్ ప్రభుత్వ పాలనలో అన్నింటా అభివృద్ధి సున్నానేనని టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు విమర్శించారు. ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 22వ వార్డులో టీడీపీ నాయకులు పర్యటించారు. నిత్యావసర వస్తువులు, కరెంట్ బిల్లులు, ఇసుక, ఇంటి పన్నులు ఎలా పెరిగాయో ప్రజలకు విజయకుమార్ వివరించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని విధాలుగా నష్టపోయామంటూ ప్రజలు టిడిపి నాయకులు ఎదుట వాపోయారు. టీడీపీకి ఓట్లేస్తే అభివృద్ధికి ఓట్లు వేసినట్లేనని ఆయన పిలుపునిచ్చారు. నెమళ్ళూరు సుబ్రహ్మణ్యం, పూల శేఖర్, బాలయ్య, రమేష్, కోటా చారి, తేజ ,అనూష, చాంద్ బాషా, కంఠా రమేష్, చక్రాల ఉషా పాల్గొన్నారు.

కరోనా వేరియంట్‌పై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి -బాలాయపల్లి : బిఎఫ్-7 కరోనా వేరియంట్‌పై అప్రమత్తత అవసరమని తహశీల్దారు అజ్మీత్తుల్లఖాన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బిఎఫ్ -7 కరోనా వేరియంట్ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్కులు తప్పని సరిగా ధరించాలన్నారు. ప్రజలకు అందుబాటులో వైద్య సిబ్బంది ఉండలన్నారు. ఇక ప్రతి ఇంటిని సందర్శించి వారి ఆరోగ్య వివరాలు తెలుసుకుని ఉండలన్నారు. ఇక 15 సచివాలయంలో కరోనా వైరస్ పరీక్షలకు సంబంధించి కిట్ అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. స్థానిక వైద్యాధికారి కళ్యాణ్ చక్రవర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

In the Court of the Mact-Cum-X Additional District Judge: Tirupati
M.V.O.P.No. 67 of 2022
Chinnagangisetty Pardhu ...Petitioner
Vs
1) B.Madhu, 2) P.Chenchaiah,
3) M/s Shriram General Insurance com Ltd., Rep. by its Authorised signatory, Tirupati ...Respondents
NOTICE TO 2ND RESPONDENT
P.Chenchaiah S/o Chengaiah, S.T.Colony, Kuchivaripalli, Bheemavaram, Chandragiri Mandal, Tirupati District.
Please take notice that the petitioner herein filed the above claim petition against you claiming compensation amount for the injuries sustained by him in the motor accident and the same is posted to **11.01.2023** for appearance either in person or through Advocate. Please appear on the date of hearing either in person or through Advocate and raise your objections if any, otherwise the matter will be decided as exparte.
Date of hearing: 11.01.2023
C.SANKAR REDDY
Advocate, Tirupati. Cell: 9989258697